

# సవాలు

వసుంధర

ఐశ్వర్యారాయ్ తెలిసినట్లే ఇందిర కూడా నాకు తెలుసు., ఐశ్వర్యకు తెలియనట్లే ఇందిరకూ నేను తెలియను.

ఐశ్వర్యను నేను తెరమీద చూశాను. ఇందిరను జీవితం తెరమీద చూశాను. ఒకసారి కాదు-రైల్వేస్టేషన్లో, సూపర్ బజార్లో, జూ పార్క్‌లో-ఇలా ఎన్నోచోట్ల ఎన్నోసార్లు చూశాను.

నా అభిప్రాయంలో ఇందిరకు ఐశ్వర్యను మించిన అందం, ఆకర్షణా ఉన్నాయి. వాటికి నేను దాసుడినయ్యాను. కాంతాదాసుల కోర్కెలు తీరాలంటే తగి

నంత కనకం, తగినంత చొరవా ఉండాలనుకునే నేను, అందుకు తగినంత అనుభవం నాకుందని మాత్రం అనకోను. ఎందుకంటే మగాడికి ప్రతి ఆడపిల్లా ఓ కొత్త ప్రయోగమే!

ఇందిరను నేను తరచుగానే వెంటాడాను. ఎప్పుడూ ఒంటరిగానే కనపడింది. కళ్లలో రవంత విషాదం తొంగిచూసేంది. ఎక్కువగా బస్సుల్లోనూ అప్పుడప్పుడు ఆటో, టాక్సీల్లోనూ కనపడ్డం వల్ల అందంలో ఆమెది అత్యున్నతస్థానమైనా ఆర్థికంగా మాత్రం మధ్యతరగతి అమ్మాయేనని గ్రహించాను. దాంతో నా ధైర్యం పెరిగింది. విసరడానికి వలను తయారుచేయాలని ఆలోచిస్తూంటే ఒక రోజున వెతకబోయిన తీగ నేరుగా కాలికే తగిలింది.

ఆ రోజు పెద్దగా వానపడుతోంది. నేను నా మారుతిలో ఉన్నాను. వానను తిట్టుకుంటూనే డ్రైవ్ చేస్తున్నాను. ట్రాఫిక్‌ను తప్పించుకుందుకు ఓ సందులోకి మళ్లాను. ఆ సందు విశాలంగానే ఉన్నా నిర్మానుష్యంగా ఉంది. కాస్త ముందుకు వెడితే ఓ బస్ స్టాపు కనబడింది. అక్కడ ఓ అమ్మాయి నిలబడి ఉంది. ఆమె నన్ను కారాపమన్నట్లు సైగ చేసింది.

కారాపాను. విండో అద్దాన్ని దించాను. అంతవరకూ అస్పష్టమైన ఆకారం అప్పుడు స్పష్టమైంది. ఆమె ఇందిర.

భగవంతుడు చిత్రకారుల కోసమే స్త్రీ శరీరంలో వంపుసొంపులు పెట్టాడు. ఆమె వాటిని దుస్తుల్లో దాస్తే అందం ఇనుమడిస్తుంది. దాచిన అందాలు-దాగని అందాలై ఆమె అందాన్ని- అపురూపం చేయగల అపురూపశక్తి తడిసిన దుస్తులకుంటుంది. అందులోనూ ఆమె ఇందిర!

నిలువెల్లా తడిసి నీళ్లోడుతూ నిలబడ్డ ఇందిర ఫలపుష్పభరితమైన మొక్కలా ఉంది. ఆమె కనులు తామరలు, పెదవులు గులాబులు, బుగ్గలు మందారాలు. నా చూపులామె ముఖాన్ని దాటి కిందకు దిగలేక పోతున్నాయి. అప్రతిభుడనై అలా చూస్తుండిపోయాను.

"లిఫ్ట్ ప్లీజ్!" అందామె.

అప్రయత్నంగా ఫ్రంట్ డోర్ తెరిచాను. ఆమె తన చేతిని ముందుకు చాచి బ్యాక్ డోరును రిలీజ్ చేసింది. లేత తామరతూడు లాంటి ఆ చేతిని చూస్తూ నేనే లోకాలకు చేరుకున్నానో ఈ లోగా ఆమె వెనక సీట్లో స్థిరపడింది.

బస్సు కోసం గంట నుంచి ఎదురుచూస్తోందిట. ఇంతలో పెద్దగా వాన. ఒంటరిగా ఈ సందులో ఇంకా ఎంతసేపుండాలోనని భయపడుతూంటే దేవుడు పంపినట్లుగా నా కారొచ్చింది.

ఆమె మాటలు నా కారును పంచదారతో నింపుతున్నాయి. అందుకేనేమో నా పెధాలు తీపి అయ్యాయి. నేను నాస్తికుణ్ని కాదు గానీ ఆస్తికుణ్నీ కాను. కానీ దేవుడే నన్నా సందులోకి పంపి ఉంటే ఆ క్షణం నుంచీ ఆస్తికుణ్నే.

ఆమె దారి చెబుతూంటే ఇల్లు చేరుకున్నాం. మధ్యతరగతిలో ఓ మెట్టు పైనా ఉన్నట్లుంది. అది అపార్టుమెంటు కాదు. డాబా ఇల్లు. చుట్టూ తోట కూడా ఉంది.

ఆమె కారు దిగి థ్యాంక్స్ చెబుతూనే "ఓ కప్పు కాఫీ ఇవ్వరా?" అన్నాను యథాలాపంగా అన్నట్లు.

కానీ ఆమె సిన్సియర్‌గానే, "మీకు వేరే పని లేదంటే కప్పు కాఫీతో పాటు వేడివేడి పకోడీలు కూడా ఉంటాయి" అంది.



వేరే పని లేదంటే అనడంలో వ్యంగ్యముంటే ఉండవచ్చు. అందానికి దాసుణ్ని. దాసుడికి చిన్నతనముండదు కదా!

ఇంకా చినుకులు పడుతున్నాయి. ఇద్దరం పరుగున ఇంటి గుమ్మం చేరుకున్నాం. ఆమె తాళం తీస్తూంటే నా ఒళ్లు జల్లుమంది. అంటే ఇంట్లో ఇంకెవ్వరూ లేరు.

"రండి" అందామె. అది నాకు ఎన్నింటికో ఆహ్వానంలా అనిపించడంతో తనువు పులకరించింది.

తలుపులు తీయగానే డ్రాయింగ్ రూం. సోఫా ,కలర్ టీవీ, టెలిఫోన్. అన్నీ అందంగా సర్ది ఉన్నాయి. ఆమె నన్ను సోఫాలో కూర్చోమని తను లోపలకు వెళ్లింది. నేను సోఫాలో కూర్చుని వెనక్కి జారగిలబడి కళ్లు మూసుకున్నాను. వానలో నిలువెల్లా తడిసి ఒంటికి అతుక్కుపోయిన దుస్తులతో ఆమె దర్శనమిచ్చింది. ఇప్పుడు నా కళ్లామె ముఖం దగ్గరే ఆగిపోక నఖశిఖపర్యంతం పరీక్షిస్తున్నాయి. అంతలో ఆమె లోపలకు వెళ్లింది. అయినా నేనామెను చూస్తున్నాను. అతుక్కున్న దుస్తులు ఒంటి మీంచి తొలగిపోతున్నాయి. ఒంటికి సహజంగా అతికిన అందాలు బహిర్గతమవుతున్నాయి.

"ఏమిటాలోచిస్తున్నారు?"

ఉలిక్కిపడి కళ్లు తెరిస్తే ఎదురుగా ఆమె!

తల తుడుచుకుని కేశాలను వదులుగా జారవిడిచింది. ఆకుపచ్చని చీర, అదే రంగు రవికతో వనదేవతలా ఉంది. ఇప్పుడు నా కళ్లామె ముఖాన్ని దాటి కిందకు దిగడం లేదు. ప్రత్యక్షానికీ, పరోక్షానికీ ఎంత తేడా!

"ఏమిటాలోచిస్తున్నారు?" మళ్లీ అడిగిందామె.

"ప్రేమ" అన్నాను అప్రయత్నంగా.

ఆమె నవ్వి, "మ్యాగజైన్ చూస్తుండండి. పది నిముషాల్లో వస్తాను" అని లోపలకు వెళ్లింది.

మాగజైన్ తీశాను. ఓ స్త్రీవాదపత్రిక. శీర్షికల్లోనే తీవ్రత ఉంది. మొదటివ్యాసం చదివాను. సంప్రదాయం పేరుతో మగవాడు ఆడదానికి వేసిన కనపడని ఎన్నో సంకెళ్లలో అతి ముఖ్యమైనది శీలమట! దాన్నించి బయటపడితే తప్ప మోక్షమాడదానికి లేదని సారాంశం.

'ఇదేదో బాగానే ఉందే' అనుకున్నాను. నాలో కాస్త ఆశ రేగింది. అంతవరకూ జరిగినదంతా సమీక్షించుకోగానే ఆశ చిగుళ్లు తొడిగింది. ఊహల్లో చొరవ రిహార్సల్సు ప్రారంభమై చాలా దూరం

## ఎఱ్ఱాప్రెగడ

*(క్రీ.శ. 14వ శతాబ్ది)*

ఆంధ్రమహాభారత రచనలో నన్నయ్య, తిక్కనల తరువాత అరణ్యపర్వశేషాన్ని పూరించి, స్వకీయ ప్రతిభాపాటవంతో, కవిత్రయంలో ఒకడుగా పరిగణన పొంది ఖ్యాతిని ఆర్జించిన మహాకవి ఎఱ్ఱాప్రెగడ. రెడ్డిరాజుల కాలంలో సమధికకీర్తిని సముపార్జించిన సత్కవి ఎఱ్ఱాప్రెగడ.

సమకాలిక పండితలోకం ఎఱ్ఱాప్రెగడను 'ప్రబంధ పరమేశ్వరుడు' అని ప్రశంసించినది. అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలో "స్ఫురదరుణాంశరాగరుచి" అనే పద్యం మొదలుకొని ఆ పర్వం చివరి వరకు గద్యపద్యాలు రాసి 'ఎఱ్ఱన' మహాభారతాన్ని పూరించాడు. అరణ్యపర్వశేషంలో ఎఱ్ఱాప్రెగడ ప్రయత్నపూర్వకంగా నన్నయ కవితారీతిని అలవరచుకుని అందులో నేర్పును ప్రదర్శించి, నన్నయే రచించాడనిపించేటట్లు రూపొందించాడు.

ఎఱ్ఱనామాత్యుని ఇతర రచనలు శ్రీ లక్ష్మీనరసింహావతారము, రామాయణం, హరివంశము. వీనిలో మొదటిది 'నృసింహపురాణము' పేరుతో ప్రసిద్ధి పొందింది. మహాభారతాంధ్రీకరణ అడుగుజాడలలో నడచిన హరివంశంలో ఎఱ్ఱయ కవితాకళ పరిపూర్ణ పరిణతిని పొందింది.

కవిత్రయంలో ఒకడని మాత్రమే కాదు, ప్రతిభావ్యుత్పత్తులు పోతపోసిన మూర్తి, ఆంధ్రభాషా తపస్వి ఎఱ్ఱాప్రెగడ.

## అన్నమాచార్యుడు

*(క్రీ.శ. 1424-1503)*


కర్ణాటక సంగీతప్రపంచంలో, తెలియవచ్చినంతవరకు, మొట్టమొదటిదని అనుకుంటున్న వాగ్గేయ సారస్వతాన్ని, సంకీర్తన (పద) ప్రక్రియలో ప్రశస్తరీతిలో కర్ణపేయంగా, హృదయరంజకంగా, తెలుగులో సృష్టించి, అందులో ప్రతిపదాన్నీ శ్రీ వెంకటేశ్వరుడికి అంకిత మిచ్చి, తాను తరించి లోకం తరించడానికి మార్గం చూపిన భక్తగాయకుడు తాళ్లపాక అన్నమాచార్యుడు.

అతని తొలి నామం అన్నమయ్య. స్వస్థలం తాళ్లపాకగ్రామం. పదహారేళ్లకే తిరుపతికి చేరుకొని శ్రీ వెంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది, ఆ దేవుని ఆదేశాన్ని అనుసరించి యోగ, వైరాగ్య, శృంగారరీతులలో సంకీర్తనలను ఆయన రచించడం మొదలుపెట్టాడు. అన్నమాచార్యుడు రచించినవి ముప్పయ్ రెండువేల సంకీర్తనలు. శ్రీ వెంకటేశ్వరుని కంకితంగా రచింపన సంకీర్తనలు తామ్రపత్రాలపై లిఖితమై ఉన్నాయి. వేలకొలదిగా వున్న సంకీర్తనాలలో కొన్ని మాత్రమే మనకు లభించాయి.

'పదకవితాపితామహు'డని, 'సంకీర్తనాచార్యు'డని అన్నమయ్యకు బిరుదులు.

అన్నమాచార్యుని గేయరచనలలో సంగీతసాహిత్యాలకు ప్రాధాన్యం. ఆ పదాల్లోని భాష ఆ నాటి తెలుగు నుడికారానికి అద్దం పడుతూంది.

కర్ణాటకసంగీతం బతికినంతకాలం ధ్రువతారగా నాదమయప్రపంచంలో నిలుస్తుంది అన్నమయ్య కీర్తి. భక్తిసంగీతసాహిత్యాలు త్రివేణీ సంగమమే అన్నమాచార్యుల వ్యక్తిత్వము. అది అజరామరం, చిరస్మరణీయం, ఆనందదాయకం.



వెళ్లాయి. ఊహల లోతు చూడాలని మాగజైన్ టీపాయ్ మీద ఉంచి మళ్లీ వెనక్కు జారగిలబడి కళ్లు మూసుకున్నాను.

నా ఆశ ఫలించింది. ఊహలో ఆమె నా బాహుబంధంలో పరవశిస్తోంది.

"ఏమిటాలోచిస్తున్నారు?"

ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. ఎదురుగా ఆమె-మరి నా ఊహల కౌగిలి నుంచి ఎప్పుడు బయటపడిందో నవ్వుతూ టీపాయ్ వైపు చూపింది. ప్లేటులో పకోడీలు. కప్పులో కాఫీ.

ఆమె నాకు ఎదురుగా కూర్చుని తనో కాఫీ కప్పు అందుకుని, "కాఫీ సిప్ చేస్తూ వేడివేడి పకోడీలు తినడం నా కెంతోఇష్టం. అదీ వానప డుతున్నప్పుడు.. " అంది.

నేను మాట్లాడలేదు. ఇంకా కాఫీ కప్పు చేతి లోకి తీసుకోలేదు.

"మీకలా ఇష్టంలేదా?" అందామె మళ్లీ.

నేను తటపటాయిస్తున్నట్లుగా, "ఇష్టాన్ని చెప్ప డంలో ఆడదానికున్న స్వతంత్రం మగాడికి లేదు. నేను నా ఇష్టం గురించి చెబితే మీరు నన్ను కాఫీ తాగనివ్వరు. పకోడీలు తిననివ్వరు. గెటౌట్ అంటారు" అన్నాను.

ఆమె ముఖం అదోలా గైపోయింది, "గెటౌట్ అనే పదం అసభ్యమని నా అభిప్రాయం. ముల్లును ముల్లుతో తీసినట్లు అసభ్య తను నివారించడానికే అది వాడబడుతుంది. మీ ఇష్టం చెప్పడానికి మీకు భయమెం దుకు?" అందామె.

ఆమె మాటల చాతుర్యాన్ని మనసులో అభినందిస్తూనే "మీరు స్టన్నింగ్ బ్యూటీ అంటాను. అది అసభ్యత అవుతుందా?" అన్నాను. ఆడదాని పట్ల చొరవ అందాన్ని పొగడ్డంతోనే అరంభమవుతుందనీ, అది ఆడదీ అర్థం చేసుకోగలదనీ నా నమ్మకం."

"కాదు" అందామె.

"అందాన్ని చూసి ఆనందించడం తప్పా?"

"కాదు."

"పూలతో నిండిన గులాబిమొక్క వానలో తడిస్తే వాన వెలిశాక ఆ మొక్కను చూసే అను భూతిని మీరెప్పుడైనా పొందేరా?"

"లేదేమో!"

"ఒక్కసారి లోపలకు వెళ్లి నిలువుటద్దంలో మీ ప్రతిబింబాన్ని చూసుకోండి. తడిసి ఆరిన మహా సౌందర్యం మీరు" అనేశాను.

ఆమె ఇబ్బందిగా "మీ కాంప్లిమెంట్‌కు థ్యాంక్స్" అంది.

"ఇది పెదవి పలుకు కాదు. హృదయస్పందన. అందుకే మీరు మీ కిష్టమైన పద్ధతిలో పకోడీలు తినండి. నేను నా కిష్టమైనది చూస్తుంటాను" అన్నాను.

అప్పటికామె ముఖంలో సిగ్గు కనబడింది. చూపులు నేలకు వాలాయి. తర్వాత నే నామెను ప్రేమిస్తున్నానని చెప్పడానికి ఎంతోసేపు పట్టలేదు.

ఆమె పెద్దగా చలించలేదు. "వానలో తడిసిన అందాన్ని చూసి ప్రేమించడం ప్రేమ అనిపించు కోదు. అది వ్యామోహం" అందామె.

నఅంటే మీకు ప్రేమను నమ్మరు!" అన్నాను.

"తొలిచూపు ప్రేమ అంటే నాకు చిరాకు. ప్రేమ క్రమంగా పుట్టాలి. సాహచర్యంలో పెరగాలి" అందామె.

"నాలో ప్రేమ ఈ క్షణంలోనే పుట్టిందను కుంటే అది మీ భ్రమ" అంటూ నా జేబులోంచీ చిన్న పాకెట్ డైరీ తీసి ఆమెకిచ్చాను. తన చేతిలోని పకోడీ ముక్కను తిరిగే ప్లేట్లో ఉంచుతూ అది అందుకుందామె.

ఆ డైరీలో నేనామెను మొదట ఎప్పుడు ఎక్కడ చూసిందీ, తర్వాత నుంచి ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఆమెను గమనించిందీ వివరంగా రాసి ఉంది.

"మొదటిసారి మిమ్మల్ని చూడగానే మళ్లీ చూడగలిగితే బాగుండుననిపించంది. రెండోసారి చూసినప్పుడు మళ్లీ చూడకుండా ఉండలే ననిపించింది. మీరు కనబడే అవకాశాలున్న ప్రదేశాల్లో తిరగడమే నా వృత్తిగా మారింది. అయితే నేను మీ అడ్రసు తెలుసుకునే ప్రయత్నం చెయ్య లేదు. తెలిస్తే మీ ఇంటికి వచ్చేస్తానని భయం. మనసులో మాట దాచుకోలేనని అనుమానం. మీరు కాదంటే నేనేమైపోతానో తెలుసు. అందుకే మీ పేరు తెలుసుకోవడంతో సరిపెట్టుకున్నాను. దీన్ని మీరు ప్రేమంటారో అనరో నాకు తెలియదు" చెప్పాను ఆమె చదువుతూంటే.

ఆమె నా డైరీ నాకు వెనక్కిచ్చి "ఈ రోజు ఈ వాన సమయంలో కాఫీ, పకోడీలకు మించిన గొప్ప నుభూతిని మీ మాటలు నాకిచ్చాయి ఇంతకీ మీరు నా పేరెలా తెలుసుకున్నారు?" అంది.

"ఓ సారి బ్యాంకులో చెక్కుమీద సంతకం పెడుతూ ఇందిర అని ముత్యాలు పేర్చారు. అప్పుడు నేను మీ పక్కనే ఉన్నాను."

ఆమె ఆశ్చర్యంగా, "మీది విశిష్టమైన వ్యక్తిత్వం. మిమ్మల్ని నేను అప్పుడే ఎందుకు గుర్తించలేదో!" అంది.

"అబ్బాయిలో అందాన్నీ, అమ్మాయిలు పరిచ యాన్నీ మాత్రమే గుర్తిస్తారు. నాలాంటి అపరిచితు లెందరో మీ వంటి అమ్మాయిలకు ప్రేమికులూ, ఆరాధకులూ అయ్యుంటారు. అదలాగుంచండి. ఇంతకీ మీరు నా ప్రేమను నమ్ముతున్నదీ లేనిదీ చెప్పలేదు..."

"నమ్మాల్సిందేననిపిస్తూంది. ఇంత సంస్కారవంతంగా నా ముందు ప్రేమను బయట పెట్టిన రెండో అబ్బాయి మీరు" అందామె

మెచ్చుకోలుగా.

ఉలిక్కిపడ్డాను, "మరి మొదటి అబ్బాయెవరు?" అన్నాను అత్రుతగా.

"నా భర్త!" అంటూ సోఫాలో వెనక్కు వాలిందామె.

పక్కలో బాంబు పేలింది. అది మా ఇద్దరి మధ్యా కాసేపు భయంకరనిశ్శబ్దాన్ని సృష్టించింది.

ఆమెను ప్రేమించానన్నాను. ఆమె నా సంస్కారాన్ని పొగుడుతూ తను వివాహితనని చెప్పింది. అందులోన సందేశం నా కర్థంకాగా "మీరు వివాహిత అని తెలియక ఇలా మాట్లాడాను. మన్నించండి. సెలవు" అంటూ లేచి నిలబడ్డాను.

"కూర్చోండి" అందామె.

నేను కూర్చోలేదు. నిరుత్సాహం, అసంతృప్తి నన్ను నిలువెల్లా ఆవహించుకున్నాయి. ముందుగా అక్కణ్నించి బయటపడితే కానీ నేను వాటి నుంచి బయటపడలేను.

"కూర్చోండి. నేను చెప్పింది వింటే మీ ప్రేమ ఫలించే అవకాశం ఇప్పటికీ ఉన్నదని మీరు గ్రహిస్తారు" అందామె.

తటపటాయిస్తూనే ఇబ్బందిగా కూర్చున్నాను.

"నేను స్త్రీవాదిని. నా భర్త కూడా నన్ను నా అందాన్నే చూసి ప్రేమించినా, కాలేజీలో నా స్త్రీవాదోపన్యాసాన్ని విన్నాకనే నాతో పరిచయాన్నాశించాడు. ఆయనకు స్త్రీలంటే ప్రత్యేకగౌరవం. స్త్రీని గౌరవించడం లోనే సంస్కార ముందనీ, స్త్రీని అవమానించినవాడు కన్నతల్లిని అవమానించినట్లేననీ ఆయన అనే మాటలు నాకెంతో నచ్చాయి. చివరకు ఒక రోజున ఆయన తన ప్రేమను నా ముందు బయటపెట్టాడు. నేను అంగీకరించగానే నమ్మలేని ఓ ప్రతిపాదన చేశాడు" ఆగిందామె.

కుతూహలంగా వింటున్నాను ఊ అని కూడా అనకుండా.

అతడామె చదువుతున్న కాలేజీలోనే లెక్చరర్. ఆజానుబాహుడు. స్ఫురద్రూపి. అతడి వెనకపడే ఆడపిల్లలు కొందరున్నారు. వారినెంత దూరంగా ఉంచినా ఓ బలహీనక్షణంలో అతడొక యువతితో శరీరకానుభవాన్ని పంచుకున్నాడు. అనుభవాన్నే తప్ప అనుబంధన్నామె ఆశించకపోవడంతో చేసిన తప్పును సరిదిద్దుకోలేదే అన్న దిగులు మనసును వీడడం లేదు.

"మన వివాహానికి ముందైనా వెనకైనా సరే, నువ్వూ పరపురుషుడితో కనీసం ఒక్కసారి నాలాంటి అనుభవాన్ని పొందాలి. అప్పుడే మనం సమఉజ్జీలమవుతాం. ఇది స్త్రీపట్ల నాకున్న గౌరవానికీ, నీ స్త్రీవాదానికీ కూడా సవాలు" అన్నాడతడు.

"ఆయన నా స్త్రీవాదాన్ని సవాలు చేసి ఉండకపోతే నేనా మాటలు పట్టించుకుని ఉండేదాన్ని కాదు. భర్త అనుమతించినా పరపురుషసంపర్కం తప్పనుకుంటే నేనేమి స్త్రీవాదిని? అదీ మేమిద్దరం సమఉజ్జీలు కావడానికి మాత్రమే! ఇలాగనుకున్నాను కానీ మా పెళ్లయి ఏడాది దాటినా ఆ విషయంలో ముందడుగు వెయ్యలేకపోయాను. రెండు నెలల క్రితం ఆయన దుబాయ్ వెళ్లాడు. అక్కడ స్థిరపడి నన్ను తీసుకుని వెళ్లడానికి కనీసం మూడు నెలలు పడుతుందన్నాడు. ఈ లోగా తన సవాలుకు బదులిచ్చే ప్రయత్నం చెయ్యమనీ, ఒంటరితనం అందుకు సహకరిస్తుందనీ కూడా అన్నాడు.

ఒంటరితనం ప్రభావం నా మీద ఉన్నమాట నిజం. కానీ ఆడది ప్రేమకు ఎంతలా కట్టుబడి పోతుందో ఆయన సాహచర్యంలో నాకు

మిగతా 88వ పేజీలో.....

స్వర్ణాంధ్రప్రభ 50

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు**

**ఇటీవలి ప్రచురణలు**

| గ్రంథం పేరు | ధర |
|---|---|
| మ్యూజిక్ కాలేజ్ సిలబస్ | 20-00 |
| పగటి వేషాలు | 65-00 |
| నిరంకుశోపాఖ్యానము | 60-00 |
| వాఙ్మయి - 5 | 25-00 |
| తెలుగు కథ - 96 | 50-00 |
| తెలుగు కథ - 97 | 65-00 |
| తెలుగు కథ - 98 | 70-00 |
| తెలుగు కథ - 99 | 60-00 |
| తెలుగు కథ - 2000 | 65-00 |
| అన్నమాచార్య లిరిక్స్ ఆన్ హ్యూమనిజం | 40-00 |
| వందేమాతరం నుండి జనగణమన వరకు | 70-00 |
| సి.పి. బ్రౌన్ తెలుగు - ఇంగ్లీషు డిక్షనరీ | 225-00 |
| ఒక సముద్ర తీర గ్రామకథ | 80-00 |
| రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థ - కేంద్రంలో లోక్‌పాల్ వ్యవస్థ | 10-00 |
| భారత భారతి (విజ్ఞాన సర్వస్వం) | 100-00 |
| తెలుగు భాషా చరిత్ర | 60-00 |
| అంబేద్కర్ సంపుటం - 6 | 50-00 |
| ప్రహేళికా ప్రపంచమ్ | 70-00 |
| నాగానందం | 50-00 |
| మలయమారుతాలు | 50-00 |
| ఢిల్లీ ఆంధ్ర ప్రముఖులు | 60-00 |
| ఆనంద రామాయణం | 300-00 |
| రెడ్డిరాజ్య చరిత్ర | 50-00 |
| తెలుగు భాషా స్వరూపం | 60-00 |
| ఒడియా సాహిత్య చరిత్ర | 45-00 |
| మిమిక్రీ | 30-00 |
| పాణినీయం - శాస్త్ర లక్షణాలు | 120-00 |
| కథానికా లక్ష్యము - లక్షణాలు | 50-00 |
| మహా భాగవతం 1, 2 సంపుటాలు | 240-00 |
| ఆంధ్ర మహాభారతం (నాలుగు సంపుటాలు) | 340-00 |
| సి.పి. బ్రౌన్ డిక్షనరీ - ఇంగ్లీషు - తెలుగు | 250-00 |
| భాషాంతరంగం | 40-00 |
| జానపద విజ్ఞానం, సంస్కృతి | 70-00 |
| చిత్రకళ | 40-00 |
| తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు | 40-00 |
| వయోలిన్ | 20-00 |
| త్యాగరాజ పంచరత్నాలు | 12-00 |
| ఎ గ్రేట్ కామనర్ (వావిలాల) | 25-00 |
| లలిత సంగీత చరిత్ర | 40-00 |

వివరాలకు : డైరెక్టర్, ప్రచురణల విభాగం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

**ఆచార్య ఎన్. శివరామమూర్తి**

రిజిస్ట్రారు

## 50 స్వర్ణాంధ్రప్రభ


### గురజాడ అప్పారావు
(క్రీ.శ. 18611915)

న్యాంధ్రసాహిత్య ప్రవర్తకుడు గురజాడ. విశవశ్రేయస్సు కోరి సాహిత్యసృష్టి చేసిన ద్రష్ట. ఆయన యలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో జన్మించారు. చీపురుపల్లిలో ప్రాథమిక విద్యనభ్యసించి,విజయనగరం కళాశాల్లో పట్టభద్రుడై అదే కళాశాలలో ఉపన్యాసకుడుగా కొంతకాలం పనిచేశాడు.

ప్రాచీనలిపి పరిశోధకుడుగా వాఙ్మయసేవ ప్రారంభించి, తెలుగు భాషాస్వరూపాన్ని వివిధదృక్కోణాలనుండి పరిశీలించి తనదైన ఒకరచనా పద్ధతిని అలవరచుకొన్నాడ. తాను రూపొందించుకున్న ప్రత్యేక రచనారీతిలో ఎడతెగని సాహితీకృషిని సాగించి నాటకం,కథ,ఖండకావ్యం మొదలైన వివధప్రక్రియులలో యేనాటికీ మరిచిపోజాలని రచనలను ఆయున తెలుగు ప్రజలకు ప్రసాదించాడు.

గురజాడ రచనలలో ఎన్నదగినవి: కన్యాశుల్కం టకం, ముత్యాలసరాలు ఖండకావ్యం తెలుగులో వాడకుభాషలో రచనసాధ్యమని నిరూపించిన వారిలో గురజాడ అగ్రగణ్యుడు. ఆయున 'కన్యాశుల్కం' ఆంధ్రనాటక పురోగమనానికి దివిటీ పట్టింది. కన్యాశుల్కం పటిష్టమైన నాటకీయ సంభాషణకు ఆటపట్టు.

ప్రాంతీయ దురభిమానం జాతీయుతను తప్పుదోవలు పట్టించే లక్షణాలు కనిపించడంతోనే ఆయన దేశమంటే మట్టి కాదోయ్,దేశమంటే మనుషులోయ్ అనీ 'దేశమును ప్రేమించుమన్నా' మంచి అన్నది పెంచుమన్నా ని తన విశ్వజనీన ప్రేమను వెల్లడించాడు.



.....25వ పేజీ తరువాయి

తెలిసింది. సంస్కారంలో ఆయున్ను మరిపించగల వ్యక్తి ముందు తప్ప నాలో బలహీనత ఏర్పడదని అర్థమైంది. ఇన్నాళ్లకు ఈ రోజు ఆయున వంటి సంస్కారవంతుణ్ని మీలో చూస్తున్నాను..." చివరి వాక్యం పూర్తి చేస్తుండగా ఆమె పెదవులు వణికాయి.

నా రొట్టె విరిగి నేతిలో పడనున్నదని అర్థమై పోయింది. ఆమె భర్త సంస్కారంలో, ఆమె స్త్రీవాదంలో నాకున్న అవకాశాన్ని వెతుక్కుంటూ ఆమెనే గమనిస్తున్నాను.

అది ఒంటరితనమో, వాతావరణప్రభావమో చెప్పలేను కానీ ఆమె చూపుల్లో సంసిద్ధత కనబడుతోంది.

వివాహిత, మంచి కుటుంబానికి చెందినది. ఎంత స్త్రీవాది అయినా సంప్రదాయాన్ని ఎదిరించడానికి తటపటాయిస్తూంది. ఇబ్బంది పడుతూంది. ఇలాంటప్పుడే నేను విజృంభించాలి. సువర్ణావకాశం. పాలకోవాలాంటి పిల్ల. బలహీనక్షణాల్లో ఉంది.

"మీరు మీ గురించి చెప్పారు. నేను నా గురించి చెబుతాను, వినండి" అంటూ నా ప్రయత్నానికి శ్రీకారంగా చెప్పడం మొదలు పెట్టాను. "నాకు స్త్రీవాదమంటే ఇష్టం. ఉద్యోగం గొప్పదైనా, ఆస్తిపాస్తులు బాగా ఉన్నా, పెళ్లి బజార్లో మంచి రేటు పలుకుతున్నా, కట్నం లేకుండా పెళ్లి చేసుకోవాలన్నది నా ఆదర్శం. ఆమె వివాహిత అయినా నన్ను ఇష్టపడిందంటే చాలు, భర్త నుంచి విడాకులిప్పించి మళ్లీ పెళ్లి చేసుకోగలను."

అప్పటికప్పుడు గుర్తుకొస్తున్న గొప్పవాళ్ల ఆదర్శాలన్నీ ఒకటొక్కటిగా చెప్పుకుపోతున్నాను.

ఉన్నట్లుండి "ప్లీజ్, ఇక ఆపండి" అందామె. "సంస్కారంలో మా ఆయున మీ కాలిగోటికి సరిపోలడని అర్థమైపోయింది. మీ మాటలు ఆయున్ను చిన్నబుచ్చుతున్నట్లనిపిస్తున్నాయి. ఇక వినలేను. నేనిప్పుడు నిజంగా బలహీనక్షణాల్లో ఉన్నాను. మీరు తక్షణం వెళ్లిపోండి. మీ ఫోను నంబరిచ్చి వెడితే గంటతర్వాత మిమ్మల్ని కంటాక్టు చేస్తాను. నాకా మాత్రం టైం కావాలి."

ఆ గొంతులోని ఆవేదన నాకు అర్థమై పోయింది. అలాంటి సమయంలో రసాభాస చెయ్యగూడదనుకుని ఆమె చెప్పినట్లే చేసి ఇల్లు చేరుకున్నాను. అక్కడ నాకు నిముషమొక యుగమై వేధించినా ఫోను మాత్రం సరిగ్గా ఆమె కోరిన గంట వ్యవధిలోనే మ్రోగింది. అత్రుతగా ఫోన్ చేస్తే ఆమె గొంతు హలో అంటూ నా గుండె జల్లుమనిపించంది. ఆమె మాటలు కొనసాగాయి.

"మీ క్వాలిటీస్ నన్ను బాగా అప్సెట్ చేశాయి. ఎందుకంటే అవి తెలియుక అప్పటికే నేను ఆలోచనల్లో మీతో చాలా దూరం వెళ్లాను. నా బలహీనత నుంచి బయుటపడాలనే మిమ్మల్ని దూరంగా పంపేశాను. లేకుంటే మిమ్మల్ని త్యాగం చేయుడం నాకంత సులభం కాదు."

"త్యాగమా?" అన్నాను అర్థంకాక.

"అవును. త్యాగమే. నా చెల్లెలు రమ కోసం. అది నా కంటే ఏడాది చిన్నది. అందంలో నా కంటే చాలా గొప్పది. ఓ బలహీనక్షణంలో ఓ పురుషుడికి లొంగిపోయుంది. వాడామెను పెళ్లి చేసుకోడు. స్త్రీవాదంలో నన్ను మించిన ఎత్తుకెదిగిన రమ తనకు పెళ్లి కాకున్నా బాధలేదు గానీ జరిగింది రహస్యంగా ఉంచనంటుంది. మీ వంటి పురుషోత్తములుంటారని తెలియుక నేను కూడా దానికి పెళ్లి కాదనే అనుకున్నాను. మీ గురించి పూర్తిగా తెలిశాక నా భర్త విసిరిన సవాలుకంటే నా చెల్లి భవిష్యత్తు ముఖ్యమనిపించింది. నా చెల్లికాబోయే భర్తతో సంపర్కమంటే అది ఊహలో కూడా భరించలేను. కాబట్టి నా భర్త సవాలుకు తగిన వ్యక్తి అన్వేషణను పునఃప్రారంభించక తప్పదు. నా చెల్లి విషయంలో మీ నిర్ణయానికై ఎదురుచూస్తున్నాను."

ఒక్కసారిగా ఒళ్లంతా నీరసం. ఇప్పుడు నేనేం చెయ్యాలి? నేను చెప్పినవన్నీ అబద్ధాలనీ, ఆమె మీద మోజులో అప్పటి కప్పుడు కల్పించాననీ ఒప్పుకుందామంటే, తను చెప్పినవీ అబద్ధాలేనని ఆమె కూడా అనొచ్చు. అబద్ధం చెప్పినందుకామెను తప్పు పట్టే అర్హత నాకుండదు.

అహంకారం విడిచిపెట్టి పొందుకోసం కాళ్లయినా పట్టుకుందామంటే అసభ్యతకు గెటౌట్ అనడం ముల్లును ముల్లుతో తీయుడం వంటిదని ముందే చెప్పింది.

ఇంతకీ ఆమె భర్త ఉన్నాడా? చెల్లి ఉందా? ఆ చెల్లి తప్పు చేసిందా?

వాటికి సమాధానాలు తెలుసుకోవాలంటే నేను ముందడుగు వెయ్యాలి. వెయ్యగలనా అని నా మనసే నన్ను సవాలు చేస్తోంది.

ఆడదాని అందానికి తెలివి జతపడితే, ఆ ఆడది మగాడికెప్పుడూ సవాలే అవుతుందని నాకు అర్థమైంది.

ఆమె తన సవాలు గురించీ, త్యాగం గురించీ పదే పదే చెప్పి న్ను పురుషోత్తముడని రుజువు చేసుకోమని సూచిస్తూ చివరకు ఫోను పెట్టేసింది.

అప్పుడే నాకూ, ఆమెకూ కనెక్షన్ కట్టయింది. ■